ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన బాలనాగమ్మ అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందింది. శనివారం జెడ్పీటీసీ వెంకటేశ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్‌లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రూ.3వేలు, శ్రీనివాస్ యాదవ్ రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పరం జ్యోతి, రమేశ్, వినోద్‌కుమార్, శ్రీశైలం, నవీన్, మైసయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న జ్ఞాన ప్రసూనాశర్మ

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల శ్రీరామాంజనేయస్వామి క్షేత్రంలోని జ్ఞాన సరస్వతీమాత మందిరంలో జ్ఞాన ప్రసూనాశర్మ ఆధ్వర్యంలో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూనాశర్మ మాట్లాడుతూ.. ఇక నుంచి నిర్విరామంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. బాసర వెళ్లలేని భక్తులు చిన్నారులకు ఇక్కడ అక్షరాభ్యాసం చేయించుకోవాలని సూచించారు. అనంతరం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



తలకొండపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మల్లు రవి, తదితరులు

ఆమనగల్లు: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతోందని, 14కు పైగా స్థానాలు గెలుస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో శనివారం మల్లురవికి మద్దతుగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ప్రచారంలో మల్లురవి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, రవీందర్‌నాయక్, ఇందిరాశోభ పాల్గొన్నారు.

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పనులు చేస్తుందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కుల గణన చేపడుతుందని చెప్పారు.

తలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పడకల్‌గేట్, దేవుని పడకల్, పడకల్, తలకొండపల్లి గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, కల్వకుర్తి కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ శోభాఇందిర, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ.. మీ అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే గెలుపు ఖాయం

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య

మంచాల: ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేస్తే భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతితిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎంపీగా పనిచేసిన అనుభవం గల నాయకుడు, బీసీ నేత, నిస్వార్థ నాయకుడు, ప్రజా సేవకుడిగా పని చేసిన డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ తిరిగి బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాండాల జంగయ్యగౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహారెడ్డి, కొండల్, నూకం రాజు, రాజేంధర్‌రెడ్డి, పాండు, రమేశ్, కృష్ణ, రాజుగౌడ్, యాట రమేశ్, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, వివిధ గ్రామాలకు చెందిన బూత్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాషయ్య, తదితరులు

భువనగిరిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్: భువనగిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని, అత్యధిక మెజారిటీ సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మన్నెగూడలోని సార్థ బీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని పురస్కరించుకొని శనివారం ఆయన తొర్రూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొంటారని నియోజకవర్గానికి చెందిన బూత్‌స్థాయి కార్యకర్త నంచి ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. భువనగిరి పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ కంచుకోట అని, ఇక్కడ అత్యధిక మెజారిటీ సాధించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. సోమవారం జరిగే సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆయన నాయకులను కోరారు. ప్రతి మండల, మున్సిపాలిటీలకు చెందిన నాయకలకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన సుభాష్



మాజీ మంత్రి కేటీఆర్‌తో సుభాష్

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను శనివారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురమల్ల సుభాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని నందినగర్ కేటీఆర్ నివాసంలో మాజీ మంత్రి కేటీఆర్‌ను సురమల్ల సుభాష్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికలలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కేటీఆర్ సూచించినట్లు సుభాష్ వివరించారు. వచ్చే ఎన్నికలలో యువత బీఆర్‌ఎస్ వైపు ఉండేలా చూడాలని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని సూచించినట్లు ఆయన తెలిపారు.





నేడు అయ్యప్ప మహాపడిపూజ

ఆమనగల్లు: పట్టణంలోని అయ్యప్ప కొండపై వెలసిన హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి మహాపడిపూజను ఈ నెల 14వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు దేవాలయ సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపకుడు రాజ్‌దేశ్‌పాండే గురుస్వామి నేతృత్వంలో అయ్యప్పకొండ ట్రస్టు చైర్మన్, జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆధ్వర్యంలో మహాపడిపూజ నిర్వహిస్తున్నామని వారు వివరించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

రైతులకు పరిహారం అందజేయాలి

యాచారం: కరువు పరిస్థితులతో ఎండిపోయిన పంటలను సర్వే చేసి బాధిత రైతాంగానికి ప్రభుత్వం వెంటనే పరిహారాన్ని అందజేయాలని యాచారం సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని మొండిగౌరెల్లి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, నక్కర్తమేడిపల్లి, నస్దిక్‌సింగారం, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, యాచారం, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో బోరుబావుల్లో గణనీయంగా భూగర్భజలాలు తగ్గి వరి, కూరగాయలు, పండ్లతోటలు ఎండిపోయినట్లు తెలిపారు. అధికారులు వెంటనే సర్వే చేసి రైతాంగానికి ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందజేయాలని కోరారు. స్పందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

దేవాలయాల నిర్మాణానికి సహకారం

మాడ్గుల: దేవాలయాల నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పకీరతండా గ్రామ పంచాయతీలో గల బాలు తండాలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించిన రాఘవేందర్‌రెడ్డికి ప్రజలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల నిర్మాణాలకు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. తండా అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలకైనా చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూపదేవిలాల్, లక్ష్మణ్, చంద్రు, అమర్‌సింగ్, రాందాస్, లాలు, రఘురాం, రాజు, వాళ్య నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.



